# మహిమాన్వితం కాణిపాక గణపతి దర్శనం



ఏదో ఆ మోక్షంమాత్రమే కావాలంటూ పూజించే రోజులు పోయాయి. ఏదో ఓ కోరికో- ఏవో కొన్ని కోరికలో ఈ దేవుణ్ణి సేవిస్తే తీరుతాయనిపించినప్పుడే,ఆ దైవాన్నీ, దేవాలయాన్నీ దర్శించే రోజులొచ్చాయనేది లౌకికంగా కన్పిస్తున్న నిజం.

ఒకప్పటి రోజుల్లో ఓ ఆలయాన్ని చూస్తూ అది రామాలయం- ఇది శివాలయం... అని ఇలా చెప్తూండేవారు. ఇప్పుడు ఏ దేవుడైనా ఆ ఆలయంలో ఉండి తీరాల్సిందే అన్నట్లు దేవతలసమూహ ఆలయాలు అయిపోతున్నాయి దాదాపుగా అన్ని దేవాలయాలూ. అలా కాకుండా 'ఇదెప్పటికీ వినాయకుని దేవాలయమే' అన్నట్లు కన్పించే పవిత్ర సన్నిధానం కాణిపాక వినాయక దేవాలయం.ఈ ఆలయానికి ఇంతప్రసిద్ధీ ప్రాముఖ్యం ఎలా వచ్చిందో తెలుసుకుందాం!

ఏ ఆలయానికైనా మన తండ్రులు, తాతలు, ముత్తాతలు...ఇంకా అంతకంటే పూర్వులు-ఇంకా ఆనాటిగ్రామస్తుల నోళ్ళలో పడి-లోకానికి అలా వచ్చే చరిత్రంటూ ఒకటి ఉంటుంది. అది ఆలయానికి సంబంధించిన ఆచార వ్యవహారాలకీ, సంప్రదాయాలకీ సరిపడే తీరులోనే కన్పిస్తూ-ఈ చరిత్ర నమ్మదగినదే సుమా!- అని అన్పింపజేస్తుంది.

## వినిపించే కథ

**చి**త్తూరుకి సమీపంలో ఉన్న నేటి ఐరాల మండలంలో ఒకప్పుడు ముగ్గురు వికలాంగులుంటూండే వారు. వాళ్ళకి కేవలం ఓ వ్యవసాయ భూమే ఆధారంగా ఉంటుండేది. ఎప్పుడూ ఆ వ్యవసాయభూమిలో ఉన్న ఓ నూతినుండే నీటిని తోడుకుంటూ వ్యవసాయాన్ని చేసుకుంటూండేవాళ్ళు.

ఓ సంవత్సరం నూతిలో నీరు పూర్తిగా అట్టడుక్కివెళ్ళిపోయింది-వ్యవసాయం చేసుకునే వీలే లేకపోయింది వీళ్ళకి. దాంతో ఈ ముగ్గురూ ఆ నూతికి పూడిక తీయించదలిచారు-అంటే నూతిలో పేరుకుని ఉన్నమట్టిని తొలిగించి నూతిని మరింత లోతు చేయదలిచారు. ఆ వికలాంగులైన ముగ్గురిలో ఒకరు అంధుడు (గుడ్డివాడు పుట్టుకతో). మరొకడు బధిరుడు (పుట్టుకతో చెవిటవాడు).ఇంకొకడు మూకుడు (పుట్టుకతో మూగవాడు).

అయినా పరస్పర అవగాహనతో వ్యవసాయాన్ని చక్కగా చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తూండేవాళ్ళు. ఈముగ్గురూ తగిన పరికరాలతో నూతిని తవ్వడానికి నూతిలోనికి దిగి పనిని ప్రారంభించాక కొంతసేప య్యాక పెద్దబండరాయి కన్పించింది.

ఆలోచించుకుని దాన్ని పగులగొడితే ఆ రాతికి చిల్లుపడి జలపడచ్చు (నీళ్ళుపైకి చిమ్ముకుని వేగంగా రావచ్చు) లేదా రాతిని పూర్తిగా పగులగొడితే పూర్తి జల మనసొంతం కావచ్చుననుకుంటూ పెద్ద పలుగు (గునపం, గడ్డపార)తో ముగ్గురూ మూడు వైపులా గట్టిగా పొడిచారు బలంగా ఆ రాతిని.

## విగ్రహ రహస్యం

**అం**తే! ఖంగుమనే శబ్దం వినిపిస్తూ పెద్దగా రక్తం పైకి చిమ్ముకుంటూ రాసాగింది. భయపడిపోయిన ముగ్గురూ నూతినుండి పైకొచ్చి వెంటనే గ్రామంలోకి పరుగెత్తుకెళ్ళి గ్రామస్తులకి ఈ విషయాన్ని చెప్పారు.గ్రామస్తులు ఈముగ్గుర్నీ చూస్తూ ఆశ్చర్యపడ్డారు.

మూగవాడు సంజ్ఞలతోకాక మాటాడుతూ ఈ విషయాన్ని చెప్పడం, గుడ్డివాడు నేరుగా అందరినీ చూస్తూ వాళ్ళ కంఠధ్వనిని ఆనవాలుపట్టి పేర్లతో పిలుస్తూ ఈ రక్తం చిమ్మిన విషయాన్ని చెప్పడం, చెవిటివాడు ఈ గ్రామస్తులడిగిన ఆ సంఘటనకి సంబంధించిన విషయాలని విని మరీ సమాధానాలని చెప్తూండడంతో అంతా విస్తుపోయారు.

అంతేకాదు. ఆ గ్రామ పెద్దకి కిందటి



రాత్రి ఇదే కల రావడంకూడా జరిగింది.దాంతో అక్కడేదో బావిలో మహిమ ఉందనుకుంటూ వీళ్ళు బావి దగ్గరకి బయల్దేరారో లేదో ఈ వార్త గాలితో సమానంగా ఊరంతా వ్యాపించడంతో దాదాపు ఊరంతా అక్కడి కొచ్చేసింది. ఈ రోజుల్లోనైతే ఈ వార్తని పత్రికా మాధ్యమాల్లో వార్తలరూపంలో, ప్రసారాల రూపంలో చూపించడం- దీనిమీద ఓ చర్చ-ఇదంతా భ్రాంతి అని కొట్టిపారెయ్యడం, భక్తుల మనోభావాల్ని దెబ్బ తీసేలా చర్చలు... ఇలా సాగి ఉండేవి.

వెంటనే అందరూ అప్పటికప్పుడు సమావేశమై క్షణాల్లో ఏంచేస్తే ఈ విగ్రహమహిమా రహస్యం అందరికీ తెలుస్తుందో ఆ తీరుగా భక్తిభావంతో కార్యక్రమాలని ప్రారంభించాలనుకున్నారు.

## ఆలయానికి శక్తి

ఈ ఆలయానికి ఇంతటి శక్తి రావడానిక్కారణం స్పష్టంగా ప్రత్యక్షంగా తెలుస్తోందిగా మనకి. ఎక్కడైనా ఓ దైవాన్ని ప్రతిష్ఠించాలంటే ముందుగా ఓ శిలని ఆ దైవరూపంగా శిల్పితో చెక్కిస్తారు. దానికి జలాధివాసం (నీళ్ళలో ఓ రోజుపాటు ఉంచడం), క్షీరాధివాసం (పాలలో ఉంచడం ఒకరోజు పాటు), ధాన్యాధివాసం (ధాన్యంలో ఓ రోజంతా ఉంచడం)... ఇలా 21 అధివాసాలని చేస్తారు.

దాంతో ఆ విగ్రహంలో ఏవైనా చిన్నబోలుతనం ఉండి దానిలో ఏ చిన్నకప్ప అయినా దాగుంటేవెంటనే టప్పుమనే శబ్దంతో ఆ రాతిపెంకుని పగలగొట్టుకుని అది బైటికొచ్చేస్తుంది. ఈ పరీక్షగాని చేసి ఉండని పక్షంలో ముందునాటికి అభిషేకాలు నిరంతరం సాగుతాయి కాబట్టి, అప్పుడేదైనా ఇలాంటిదిగాని జరిగితే మళ్ళీ విగ్రహాన్నితేవడం ప్రతిష్ఠించడం... పెద్ద పనైపోతుంది.

ఇలాగే పాలలో ఓ తీరు జిగురూ, ఓ రోజుపాటుంటే ఓ తీరు మాగుడు వాసనా కారణంగా ఎక్కడయినా దాక్కున్న పురుగులుంటే అవి ఈ జిగురుకి అతుక్కుపోయి మనకి దొరికిపోతాయి. అంతేకాక ఆ వాసనకి తట్టుకోలేక కొన్నిక్రిములు బయటికి వెళ్ళిపోతాయి అధివాసాలు ప్రారంభకాలంలోనే.

## స్వయంభువు

ఇక ధాన్యంలో ఉంచినప్పుడు పుట్టే వేడిమికి తట్టుకోలేని కొన్ని పురుగులూ, బల్లిపిల్లలూ...వంటివి బయటికి పారిపోతాయి.ఇలాగే మిగిలిన అధివాసాల కారణంగా విగ్రహంలో ఏ తీరు దోషమూ లేకుండా తగిన పరీక్షలకి గురిచేసినట్లవుతుంది. ఆ మీదటవిగ్రహానికి చేయవలసిన అన్ని వైదిక కార్యక్రమాలనీ చేసి ప్రతిష్ఠిస్తారు. ఇక్కడ విగ్రహం ఎక్కడి నుండో తెచ్చిన రాయికాదు- చెక్కబడిందీ కానేకాదు. స్వయం-భు-వు. స్వయం-తనకి తానుగా, భువు-భూమినుండి వెలికి వచ్చిపుట్టినది కాబట్టి శక్తిమంతమైనది. సరైన కొలతలతో పుట్టిందికూడా.

ఎక్కడైనా విగ్రహాన్ని ప్రతిష్ఠించాక నిత్యంపూజలూ, హోమాలూ, యజ్ఞాలూ మొదలైనవి జరుగుతూంటే ఆ మంత్రాల శక్తి ఈ విగ్రహానికి చేరి క్రమక్రమంగా విగ్రహం (వి-విశేషంగా మంత్ర శక్తిని, గ్రహ-గ్రహించేది) తపశ్శక్తిని పెంచుకునేదిగా అవుతూంటుంది. ఆ మీదట కోరుకున్న భక్తులకి వాళ్ళ కోర్కెలని తీరుస్తూ ఉంటుంది.

అయితే ఇక్కడి విగ్రహం ప్రతిష్ఠింపబడ్డాక శక్తిని పెంచుకుని ఆ మీదట కోరికల్ని తీర్చినది కాదు.పుట్టుకకి పూర్వమే- అంటే ఇంకా తాను ఓ దైవంగా ప్రతిష్ఠింపబడకుండానే-ముగ్గురు అంగవికలురకీ- అందునా పుట్టుకతో గుడ్డితనం-చెవిటితనం-మూగతనం ఉన్న ముగ్గురికీ ఆ అంగవైకల్యాన్ని తొలిగించిన శక్తి మంతమైన విగ్రహం. ఏ ధృతరాష్ట్రునికో భారతంలో విశ్వరూపాన్ని చూపించడంకోసం తాత్కాలికంగా దృష్టినిచ్చినట్లు కాదు- శాశ్వతంగా అంగవైకల్యాన్ని తొలిగించిన విగ్రహం.

## నారికేళ నైవేద్యాలు

ఈ విగ్రహాన్ని చూడ్డానికొచ్చిన నాటి భక్తుల్లో సామాన్య భక్తులున్నారు. వాళ్ళంతా ఎన్ని కొబ్బరికాయలు దొరికితే అన్నిటినీ కొడుతూ 3 అహోరాత్రాలపాటు భజనలని చేస్తూనే ఉండిపోయారు. (కాణిపాకం అంటే 'పొంగిపొర్లిన కొబ్బరినీరు' అని అర్థమట).

వీరికంటే పైస్థాయిలో ఉన్న భక్తులు దైవానికి సంబంధించిన స్తోత్రాలని ఒకదాని వెంట ఒకటి చొప్పున 3 రోజులపాటు పఠిస్తూనే ఉండిపోయారు. కొబ్బరికాయల్ని కొడుతూనే ఉన్నారు.

వీరికంటే మరింత స్థాయిలో ఉన్న వేదవిద్వాంసులు అథర్వశీర్ష ఉపనిషన్మంత్రాలని పారాయణంచేస్తూ- గణపతి హోమాన్ని నిర్వహిస్తూ- సహస్ర మోదకాలని (100 ఉండ్రాళ్ళని) అగ్నిదేవునిద్వారా వినాయకునికి మంత్రపూర్వకంగా యజ్ఞవిధానంలో పంపుతూ ఆయన్ని తృప్తిపరిచారు అందరూ చూస్తుండగా. కొబ్బరికాయల్ని కొడుతూనే ఉన్నారు.

భజనలవాళ్ళుగాని, స్తోత్రాలవాళ్ళుగాని, ఈ వేద మంత్రపూర్వకంగానూ, ఉపనిషన్మంత్రం ప్రకారంగాగాని పైతీరు క్రతువుని నిర్వహించినవారుగాని ఇలా ఏ ఒక్కరూకూడా- ఇంత చేశాం కాబట్టి ఇంత దక్షిణా!- అంటూ ఓ సూచనని చేయడం- దానికోసం పట్టుబట్టడం చేయకుండా- ఇది మా ధర్మం- అంటూ కొబ్బరికాయల్ని కొడుతూనే 3 అహోరాత్రాలపాటూ నిస్స్వార్థంగా దైవారాధనని చేశారు.

## పెరిగే కవచం

అప్పుడు ఆ రక్తధారలు ఆగాయి. పైకి తీస్తే వినాయకుడు స్పష్టంగా దర్శనమిచ్చాడు. అంతకుముందే ఆయన శిరసూ, బొజ్జా, పొట్టిదనం చూచాయిగా వెనుకవైపుగా కన్పిస్తున్న శిలా రూపంలో లీలామాత్రంగా కన్పించడంతో ఆ శిల సాక్షాత్తూ వినాయకునిదే అని అర్థమైంది అందరికీ.

ఈ శక్తి అనేది- వీరు వారను భేదబుద్ధి లేకుండా అందరూ సామూహికంగానూ, ఎవరి శక్తికి తగినట్టుగానూ- వాళ్ళకి వాళ్ళు నిర్వహించిన కారణంగానూ విగ్రహానికి స్వతస్సిద్ధంగా పెరిగింది. ఇదంతా ఒకెత్తు అయితే-ఆ వినాయకుడు ఈ గ్రామం నిండుగా పులులు, ఎలుగుబంట్ల చెదురు కన్పిస్తూంటే, దాన్ని తాను ప్రతిష్ఠింపబడ్డాక ఏమాత్రమూ లేకుండా చేయడమనేది మరొకెత్తు. 11 రోజులపాటు ఈ ఆలయ సమీపంలో నిద్రచేస్తూ వినాయకారాధనని చేస్తే బుద్ధి శక్తి పెరగడం, దీర్ఘవ్యాధులు నయం కావడమనేది ఎందరి అనుభవంలోనో కన్పిస్తున్న సత్యం.

ఇక ఏ ఇద్దరి మధ్యైనా వాదం గనుక వస్తే- ఇక్కడికొచ్చి ప్రమాణం చేయడమనేది నిరంతరం సాగే ఓ సంప్రదాయం-ఆచారంకూడా. ఒకవేళ నలుగురిలో పరువుపోతుందనే అభిప్రాయంతో దొంగ ప్రమాణం చేసినట్లైతే దానికి సంబంధించిన ఫలితాన్ని అనుభవించిన సందర్భాలూ అనేకమే.

ఇంతటి శక్తిమంతుడీయన కాబట్టే, ప్రతి సంవత్సరమూ ఆయనకేర్పాటుచేయబడ్డ కవచం సరిపోవడం లేదు. భక్తుల భక్తిభావాలకి ఉబ్బితబ్బిబ్బవుతూ ఉంటే మరి కవచం ఎలా సరిపోతుంది? స్వస్తి.

**డా॥ మైలవరపు శ్రీనివాసరావు**